సీఎం వద్దనే కీలక శాఖలు

- మంత్రులకు శాఖలు కేటాయించిన సీఎం రేవంత్
- గెజిట్‌తోపాటు ఉత్తర్వులు జారీచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆర్థిక, విద్యుత్తుశాఖలు
- ఉత్తమ్‌కుమార్‌కు ఇరిగేషన్, వెంకట్‌రెడ్డికి ఆర్ అండ్ బీ
- సీతక్కకు పంచాయతీరాజ్, సురేఖకు అటవీశాఖ కేటాయింపు

హైదరాబాద్, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): మంత్రివర్గ సహచరులకు శాఖలను కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కీలకమైన శాఖలన్నీ తన వద్దనే ఉంచుకున్నారు. ఈ నెల 7న సీఎంతోపాటు 12 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. అయితే వారికి శాఖలను మాత్రం కేటాయించలేదు. శాఖల కేటాయింపుపై ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం ఆధారంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం గెజిట్ నోటిఫికేషన్‌తోపాటు ఉత్తర్వులు కూడా జారీచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హోం, పురపాలక, పట్టణాభివృద్ధితోపాటు సాధారణ పరిపాలన విభాగం, మంత్రులకు కేటాయించని ఇతర శాఖలను తన వద్దే ఉంచుకున్నారు. అదే విధంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కీలకమైన ఆర్థికం, విద్యుత్తు శాఖలను కేటాయించారు. శాఖల కేటాయింపుపై అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. కాంగ్రెస్ సీనియర్ నేతలతో సుదీర్ఘ మంతనాల తర్వాత ఎవరికి ఏ శాఖ కేటాయించాలనేది కొలిక్కి వచ్చింది. ఆ జాబితాపై శుక్రవారం రాత్రి రాజ్‌భవన్ ఆమోదం తీసుకున్నారు. అనంతరం శనివారం అధికారికంగా మంత్రులకు శాఖలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఏ మంత్రికి ఏ శాఖ అనే ఉత్కంఠకు తెరపడినట్లైంది.

కేటాయించని కీలక శాఖలు

శాఖల కేటాయింపులో భాగంగా పలు కీలక శాఖలను ముఖ్యమంత్రి తన వద్దనే ఉంచుకున్నారు. ముఖ్యంగా హోంశాఖ, విద్యాశాఖలను ఎవరికీ కేటాయించలేదు. పశుసంవర్ధక శాఖ, కార్మిక శాఖ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ శాఖ, కమర్షియల్ ట్యాక్స్, యువజన, క్రీడల శాఖలను కూడా శాఖల్ని ఎవరికీ కేటాయించలేదు.

మంత్రివర్గ విస్తరణ ఎప్పుడో?

రాష్ట్ర మంత్రివర్గంలో మరో ఆరుగురికి చోటు కల్పించే అవకాశం ఉన్నది. అయితే మంత్రివర్గం విస్తరణ ఎప్పుడు అన్నదానిపై పార్టీలో, ప్రభుత్వంలో ప్రధానంగా చర్చ జరుగుతున్నది. నిబంధనల ప్రకారం మంత్రివర్గంలో సీఎంతో పాటు మొత్తం 18 ఉండవచ్చు. అయితే ప్రస్తుతం 12 మంది మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. మరో రెండు నెలల వరకు మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం లేదని తెలుస్తున్నది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మంత్రివర్గ విస్తరణ చేపట్టి ప్రాతినిధ్యం లేని కొన్ని జిల్లాల వారికి స్థానం కల్పించే అవకాశమున్నట్టు సమాచారం. ఆ తరువాతనే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలని పార్టీ భావిస్తున్నట్టు తెలిసింది.

శనివారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కొలువుదీరిన కొత్త అసెంబ్లీ

ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, మాజిద్ హుస్సేన్, యశస్వినీరెడ్డి

మొదటిపేజీ తరువాయి...

ఒక్కో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేశారు.

హాజరుకాని 18 మంది

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా 16 మంది సభ్యులు హాజరు కాలేదు. ఎంపీ పదవులకు రాజీనామా చేయకపోవడంతో ఉత్తమ్, వెంకటరెడ్డి హాజరు కాలేదు. తుంటి ఎముక ఆపరేషన్ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాలేకపోయారు. దవాఖానలో ఆయనతోనే ఉన్న సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కూడా సభకు హాజరు కాలేదు. వీరితో పాటు బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయకపోవడంతో వారు కూడా సభకు హాజరు కాలేదు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎంపీ పదవికి రాజీనామా చేయకపోవడంతో ఆయన కూడా ప్రమాణస్వీకారం చేయలేదు. ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, బత్తుల లక్ష్మారెడ్డి సైతం ప్రమాణ స్వీకారం చేయలేదు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఉండడంతో 8మంది బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్నారు. వీరు మినహా మిగతా అందరూ ప్రమాణ స్వీకారం చేశారు.

పరస్పర శుభాకాంక్షలు

శాసనసభ ప్రారంభానికి ముందుగా హాలులోకి ప్రవేశించిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్ నేరుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి.. ఇలా ప్రతి ఒక్కరికి వద్దకు వెళ్లి పేరుపేరునా పలకరిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం సీఎం రేవంత్‌రెడ్డి, నూతన మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సభ్యులు సైతం ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు అభివాదం చేశారు. ప్రొటెం స్పీకర్ వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలియజేసిన అనంతరం అసెంబ్లీ రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. అనంతరం నూతన సభ్యులు అసెంబ్లీలోని సీనియర్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల వద్దకు వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు.

అసెంబ్లీలో కోలాహలం

కొత్తగా కొలువుదీరిన శాసనసభలో తొలిరోజున కోలాహలం నెలకొన్నది. సభలో మొదటి వరుసలో సీఎం రేవంత్‌రెడ్డి, తర్వాత ఖమ్మం జిల్లాకు చెందిన భట్టి, తుమ్మల, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సీతక్క, కొండా సురేఖలు పక్కపక్కనే కూర్చుకోవడం ఆసక్తి రేపింది. ప్రతిపక్షం వైపు మొదటి వరుసలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం, తలసాని పక్కపక్కనే కూర్చున్నారు. నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించేందుకు వారి వెంట బంధువులు, స్నేహితులు కూడా అసెంబ్లీకి తరలివచ్చారు. గ్యాలరీల్లో కూర్చుని ఆసక్తిగా తిలకించారు. అసెంబ్లీ ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకుని మురిసిపోయారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాల ప్రారంభంపై ప్రకటన

నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు కొత్త పథకాలను ప్రారంభిస్తున్నట్టు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. తొలుత రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచుతున్నట్టు వెల్లడించారు. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని తెలిపారు. అనంతరం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి మహాలక్ష్మి పథకాన్ని కూడా ప్రారంభిస్తున్నట్టు ప్రొటెం స్పీకర్ ప్రకటించారు. ఈ పథకం కూడా శనివారం నుంచే అందుబాటులోకి వస్తున్నట్టు ప్రకటించారు. అన్ని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం శాసనసభను 14వ తేదీకి వాయిదా వేశారు.

'నియమాల' వద్ద సభ్యుల తడబాటు

కొత్తగా కొలువుదీరిన మూడవ శాసనసభలో పలువురు సీనియర్, నూతన సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం వేళ తడబాటుకు గురయ్యారు. 'శాసనసభ నియమాలను పాటిస్తామని' ప్రతిజ్ఞ చేసే సమయంలో నియమాలు, సార్వభౌమాధికారం వంటి పదాల వద్ద తడబాటుకు గురయ్యారు. 17 మంది ఎమ్మెల్యేలు ఆంగ్లంలో ప్రమాణం చేయగా, మజ్లిస్ ఎమ్మెల్యేలు ఉర్దూలో ప్రమాణం చేశారు.

సైడ్‌లైట్స్

- అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం పాలకుర్తి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన అతిపిన్న వయస్కురాలైన యశస్వినీరెడ్డిని మంత్రి కొండా సురేఖ హత్తుకుని అభినందనలు తెలిపారు.
- ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేసిన అనంతరం సీనియర్ నేతలు స్పీకర్ చాంబర్ వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతుండగా ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ లేచి వెళ్లి వారికి చేయందించారు.

ప్రత్యేక ఆకర్షణగా అనిల్‌జాదవ్, మక్కన్‌సింగ్

తెలంగాణ రాష్ట్ర 3వ శాసనసభ తొలిరోజున బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోథ్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయిన అనిల్‌జాదవ్ అసెంబ్లీకి చెప్పులు లేకుండానే హాజరయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచేంత వరకూ చెప్పులు వేసుకోబోనని అనిల్ జాదవ్ దీక్ష తీసుకున్నారు. ఈ నేపథ్యంలో చెప్పులు లేకుండానే అసెంబ్లీకి విచ్చేశారు. సోమవారం దీక్ష విరమించనున్నట్టు తెలిపారు. సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సింగరేణి గని కార్మికుడి వేషధారణలో అసెంబ్లీకి విచ్చేశారు. ప్రమాణ స్వీకారం చేసి అందరినీ ఆకర్షించారు.

● ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ప్రమాణ స్వీకారం

శాసనసభ సమావేశాలకు ముందు శనివారం ఉదయం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్.. మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌తో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. అక్బరుద్దీన్‌ను గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పలువురు మంత్రులు, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

శాసనసభ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్!

14న స్పీకర్ ఎన్నిక..13న నోటిఫికేషన్

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): శాసనసభ స్పీకర్ ఎన్నిక ఈనెల 14న జరగనుంది. ఈ మేరకు 13న నోటిఫికేషన్ జారీ చేస్తారు. అదే రోజు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న శాసనసభ ప్రారంభంకాగానే స్పీకర్ ఎన్నికకు సంబంధించిన విషయాన్ని ప్రొటెం స్పీకర్ ప్రకటిస్తారు. 15న ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగిస్తారు. స్పీకర్ అభ్యర్థిగా వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్‌ను కాంగ్రెస్ ఎంపికచేసినట్టు సమాచారం.

కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఏం చెప్పారబ్బా?

హైదరాబాద్, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): నూతన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి గుసగుసలు చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సభలోనే దీనిపై చర్చించడం హాట్‌టాపిక్‌గా మారింది. తనకూ మంత్రి పదవి కావాలని రాజ్‌గోపాల్‌రెడ్డి ఇటీవల బహిరంగంగా పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఇదే విషయమై చర్చించి ఉంటారన్ని భావిస్తున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం నేరుగా తన వద్దకు వచ్చిన రాజ్‌గోపాల్‌రెడ్డిని రేవంత్ అభినందించారు.

ఆదాయ వనరులను అన్వేషించండి

- ఉచితాలను మానవ వనరులపై పెట్టుబడిగా చూడాలి
- ఆర్థికశాఖ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఆదాయ వనరుల అన్వేషణపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆర్థికశాఖ అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఆదాయ వ్యయాల గురించి మంత్రికి అధికారులు వివరించారు. మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, అభయ హస్తం మ్యానిఫెస్టో హామీలను నెరవేర్చేందుకు ఆదాయాన్ని పెంచేలా మనస్ఫూర్తిగా పనిచేయాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి పని చేస్తున్నామన్న భావనతో విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. ప్రభుత్వ పథకాలను ఉచితాలుగా చూడొద్దని, మానవ వనరులపై పెట్టుబడిగా భావించాలని సూచించారు. సమీక్షలో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన రెవెన్యూ అధికారులు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రెవెన్యూశాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని రెవెన్యూ సంఘాల ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి భాస్కర్‌రావు, సభ్యులు ముకుంద్‌రెడ్డి, భవానీశంకర్, చంద్రకళ, రఘురామశర్మ, ఉపేందర్‌రెడ్డి తదితరులు కలిశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం సమావేశం నిర్వహించి సమగ్రంగా చర్చిస్తామని మంత్రి చెప్పినట్టు వారు తెలిపారు. రెవెన్యూ శాఖలో వివిధ స్థాయిలో పాలనను మరింత పటిష్టం చేయాలని మంత్రిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే గౌతమ్‌కుమార్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, విజయేందర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సు ఫ్రీ

మొదటిపేజీ తరువాయి...

అందించిన రేవంత్.. ట్యాంక్‌బండ్ వరకు బస్సులో ప్రయాణించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు మాణిక్‌రావు ఠాకూర్, పలువురు ఎమ్మెల్యేలు, రవాణాశాఖ సెక్రటరీ వాణీప్రసాద్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిమితి

ఆరు గ్యారెంటీల్లో మరొకటి రాజీవ్ ఆరోగ్యశ్రీ(చేయూత) కింద రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వైద్య ఖర్చులను పెంచే పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోనియా గాంధీ పుట్టినరోజైన డిసెంబర్ 9 తెలంగాణకు పండుగ రోజు అని అన్నారు. డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైందని, తెలంగాణ తల్లి అంటే సోనియమ్మ రూపం కనిపిస్తుందని చెప్పారు. ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలను అమలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకున్నదని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని వెల్లడించారు. మహిళలు ఇక నుంచి రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేయవచ్చని వివరించారు. ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. తెలంగాణను సంక్షేమ రాజ్యంగా మారుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్ల ప్రోత్సాహక చెక్ అందజేశారు.

సిరిసిల్లలో ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తూ జీరో టికెట్‌ను చూపిస్తున్న మహిళలు

మా బతుకుదెరువెట్లా?

మొదటిపేజీ తరువాయి...

పాల్గొని తమ ఆవేదన వ్యక్తం చేశారు. వాహన రంగ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని సంస్థ అధ్యక్షుడు వేముల మారయ్య తెలిపారు. జీవనభృతి కింద నెలకు రూ.15వేలు ప్రభుత్వం అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు రోజుల్లోనే తమ బతుకులు అగమ్యగోచరంగా మారాయని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన పదేండ్లలో ఎప్పుడూ ఆటో డ్రైవర్లు ఇంతలా ఇబ్బంది పడలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ బతుకుల కోసం పోరాటం చేయాల్సి వస్తుండడం బాధాకరమని పేర్కొన్నారు. ఆటో మోటార్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మికులలో అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలన్నారు. ఆటో మీటర్ రేట్లు పెంచి కొత్త ఆటో పర్మిట్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఓలా, ఉబర్ సంస్థలను ప్రభుత్వం ఆధ్వర్యంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై వారం రోజుల్లోగా పరిష్కారం చూపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ డిపోల వద్ద ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ కార్యదర్శి చిన్నం బాలనర్సయ్య, నాయకుడు శాతం రమేశ్ మాట్లాడుతూ.. బండి నడిపితేనే ఇల్లు గడిచే డ్రైవర్ల జీవితాలను పట్టించుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కూల్ వ్యాన్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్‌టీయూ ప్రెసిడెంట్ నిరంజన్, డీ పర్వేజ్, బాలు నాయక్, మహ్మద్ వాజిద్, చంద్రమౌళి, ఎండీ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా జన్నారంలో కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదం చేస్తున్న ఆటో యూనియన్ మండలశాఖ అధ్యక్షుడు ననీరుద్దీన్

కాంగ్రెస్ నాయకులతో ఆటోడ్రైవర్ వాగ్వాదం

జన్నారం: మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ సర్కారు శనివారం నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. మంచిర్యాల జిల్లా జన్నారంలో ఉచిత బస్ సౌకర్యాన్ని ప్రారంభించడానికి కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇసాక్, సుధాకర్ నాయక్ వచ్చారు. ఆటో యూనియన్ మండలశాఖ అధ్యక్షుడు ననీరుద్దీన్ వారితో వాగ్వాదానికి దిగారు. ఈ పథకం వల్ల తాము ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత బస్ సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, మొగిలి, శంకర్, రాజన్న, చాంద్ పాషా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.